క్లుప్తంగా

నేడు వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

కురబలకోట : కురబలకోట మండలంలోని తెట్టు శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొరివి జగన్నాథరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాలతో భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సంతాన వర ప్రసాదుడిగా స్వామి వారికి అనాదిగా పేరుందన్నారు. బుధవారం గజ వాహనం నిర్వహించారు. గురువారం ముఖ్యమైన కల్యాణోత్సవం, అదే రోజు రాత్రి గరడోత్సవం, 21న ఉదయం రథోత్సవం (తేరు), 22న అశ్వ వాహనం, 23న హంస వాహనం, 24న బాష్యకార్ల స్వామి గజ వాహనం, 25న బాష్యకార్ల స్వామి రథోత్సవం వైభవంగా జరుగుతాయని ఆ గ్రామ సర్పంచ్ నులక మనోహర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కొరివి జగన్నాథరెడ్డి తెలిపారు.

రూ.2.37 లక్షల ఆదాయం

బి.కొత్తకోట : నగర పంచాయతీ ప్రైవేటు బస్టాండ్ గేటు వసూలు గుత్తకు వేలం పాటలను బుధవారం నిర్వహించారు. రెండు సార్లు వేలం పాటలు నిర్వహించినా పాటదారులు రాకపోవడంతో మూడోసారి నిర్వహించగా ఓ పాటదారుడు రూ.2,37,652 కు పాడగా గుత్తకు అప్పగించారు.

టమాట వ్యాపారి దాతృత్వం



రైతులకు నగదు అందజేస్తున్న నజిముద్దీన్

కలకడ : ఓ టమాట వ్యాపారి దాతృత్వం కనబరిచాడు. టమాట ధరలు పతనం కావడంతో.. రైతుల కష్టాలు చూసి చలించాడు. తనకు ఏడాది పాటు టమాటలు అందించిన వారిని ఆదుకున్నాడు. కలకడ టమాట మార్కెట్‌లోని ఎస్.యం.డి.అండ్ ఎఆర్ మండి యజమాని ఎస్.నజిముద్దీన్ 45 మంది రైతులకు రూ.7,550 చొప్పున బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను రైతులు, ప్రజా ప్రతినిధులు అభినందించి, సన్మానించారు. మరింత కృతజ్ఞతతో రైతులకు వీలైనంత వరకూ సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకుని నాణ్యతతో కూడిన పంటలు, దిగుబడి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు ఇనాయతుల్లా, ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు కేఎస్ మస్తాన్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం ఇవ్వలేదని ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్డుదారులు

తంబళ్లపల్లె : మండలంలోని గుండ్లపల్లె పంచాయతీలో రేషన్‌బియ్యం పంపిణీ చేయలేదని కార్డుదారులు బుధవారం తహసీల్దార్ కళావతికి ఫిర్యాదు చేశారు. చౌకదుకాణ డీలర్ ఎండీయూ రాజశేఖర్‌నాయుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ బియ్యం పంపిణీ చేయడంలేదని ఆరోపించారు. గతంలో రెండు నెలల బియ్యం పంపిణీ చేయకుండా రేపుమాపు అంటూ ఎగ్గొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండీయూని ఏమని ప్రశ్నించినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ డీలర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజుల్లో కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు. ఫిర్యాదు చేసిన వారిలో నారాయణమ్మ, సరోజమ్మ, బయ్యారెడ్డి, లక్ష్మీరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తున్న కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం, సీపీఐ నాయకులు

పీలేరు : కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తున్న కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. సీపీఐ – సీపీఎం జీపు జాతా కార్యక్రమంలో భాగంగా స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద వారు మాట్లాడారు. నన్ను నమ్మండి ఈ దేశానికి కాపలాదారుడిగా ఉంటానని ఎన్నికలకు ముందు ప్రగల్భాలు పలికి, అధికారంలోకి వచ్చాక పేదల రక్తాన్ని పీల్చి కార్పొరేట్ గద్దలకు దోహదపడే విధంగా చట్టాలను చేస్తున్న పీఎం నరేంద్రమోదీని గద్దె దింపాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, పప్పు, నూనె ధరలను ఇష్టానుసారంగా పెంచి సామాన్యుడి నడ్డివిరుస్తున్నారని ఆరోపించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు రామచంద్ర పాల్గొన్నారు.

మహిళల సాధికారతతోనే సమాజం అభివృద్ధి

– ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

పెద్దమండ్యం : మహిళల సాధికారతతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మండలంలోని కలిచెర్ల ఎస్‌వీఎస్ కల్యాణ మండపంలో బుధవారం వైఎస్సార్ ఆసరా మూడవ విడత సంబరాలు ఘనంగా నిర్వహించారు. పెద్దమండ్యం, తంబళ్లపల్లె మండలాల నుంచి పెద్ద ఎత్తున ఆసరా సంబరాలకు మహిళలు తరలివచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల సాధికారత కోసం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని కొనియాడారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూతతో మహిళలకు ఆర్థికంగా చేయూతను అందిస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా నిధులను ప్రతి సభ్యురాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాలలో నాలుగేళ్ల కాలంలోనే అభివృద్ధి చేసి చూపించామన్నారు. ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతి పల్లెకు తారు రోడ్డు, సిమెంటు రోడ్లు వేయడం జరిగిందన్నారు. 14 ఏళ్ల పాటు సీఎంగా పని చేసిన చంద్రబాబు మహిళల సాధికారత కోసం ఏమి చేయలేదని ఎద్దేవా చేశారు. ఓట్ల కోసం బాబు, లోకేష్‌లు చేస్తున్న డ్రామాలను ఎవ్వరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో ఎమ్మెల్యేగా ఉమ్మడి జిల్లాలోనే తంబళ్లపల్లెలో అత్యధిక మెజార్టీ ఇచ్చిన ఘనత మీకే దక్కుతుందని అన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రానున్న ఎన్నికలలో మహిళలు జగనన్నను మనస్ఫూర్తిగా ఆశీర్వదించి తిరిగి సీఎంను చేయాలని కోరారు. అనంతరం మండలంలోని 616 స్వయం సహాయక సంఘాలకు రూ.5.26 కోట్లు, తంబళ్లపల్లె మండలంలోని 601 సంఘాలకు రూ.5.25 కోట్ల వైఎస్సార్ ఆసరా చెక్కులను అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి, సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సుధాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, జెడ్పీటీసీ పీరమ్మ, ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, వైస్ ఎంపీపీ టి.జయచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, సర్పంచ్‌లు మొలక బయ్యారెడ్డి, బాషా, విశ్వనాథ, విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీలు బోడెం రవితేజ, జయరాం, మండల కన్వీనర్ చాను, సచివాలయ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ చాను, ఏపీఎం మధుబాబు, గంగాధర్, నాయకులు బోనాల మధు, ముసలికుంట సుబ్బారెడ్డి, కోసూరి రామక్రిష్ణ, రామిరెడ్డి, ఆయా శాఖల అధికారులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : గుర్రంకొండ మండలం శెట్టివారిపల్లి పంచాయతీ రేగడపల్లికి చెందిన 10 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో బుధవారం చేరారు. వీరికి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేశారని, కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. నవరత్నాల ద్వారా ప్రజలకు నేరుగా పథకాలను వారి ఖాతాల్లో జమ చేస్తూ.. ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారన్నారు. కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. టీడీపీలో చేరిన వారిలో సుధాకర, గంగరాజు, ఎంజి రమణ, నారాయణ, బాషా, ఆనందరాజు, అనిల్, నవీన్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమార్, నాయకులు ఎస్‌వీ రమణ, నారాయణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

వాల్మీకిపురం పంచాయతీ ఫత్తేపురానికి చెందిన ఆదినారాయణ మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పరామర్శించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్దకు చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో చింతల ఆనందరెడ్డి, కేశవరెడ్డి, మదనమోహన్‌రెడ్డి, శంకర, సురేంద్రరెడ్డి, వెంకటస్వామి, గురుమూర్తి, రామచంద్ర, శేషప్ప తదితరులు ఉన్నారు.

గంగమ్మ సేవలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా



గంగమ్మ ఆలయంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె సిటీ : పట్టణంలోని బుగ్గకాలువ దోబీఘాట్ బోయకొండ గంగమ్మను ఎమ్మెల్యే నవాజ్‌బాషా బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతిని ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించి, ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దుశ్శాలువతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బుగ్గకాలువ దోబీఘాట్‌లో రజక కులస్తులు బోయకొండ గంగమ్మ ఆలయాన్ని ఏర్పాటు చేసుకుని 34 ఏళ్లుగా ఏటా జాతర నిర్వహించడంపై ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా బోయకొండ గంగమ్మ ఆలయం ఖ్యాతి పొందిందన్నారు. పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని, ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శకుంతల, హరి, కొత్త ఇండ్లు రవి, కౌన్సిలర్ వసీం, రహీం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

గుర్రంకొండ : మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశులు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గురువారం టి.పసలవాండ్లపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలు ముఖ్య అతిథులుగా విచ్చేస్తారన్నారు. కావున మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

శిశు సంరక్షణపై దృష్టి పెట్టాలి

పీలేరు రూరల్ : అధిక ఉష్ణోగ్రతలు ఉన్న నేపథ్యంలో శిశువుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. బుధవారం తలపుల పీహెచ్‌సీలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమానికి హాజరైన బాలింతలకు, గర్భవతులకు శిశువులపై సంరక్షణపై అగాహన కల్పించారు. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, పీహెచ్‌ఎన్. వెంకటసుబ్బమ్మ, సూపర్‌వైజర్ కృష్ణయ్య, సీహెచ్‌వో కుముద, ఏఎన్‌ఎం నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇఫ్తార్ విందు

కలికిరి : ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకొనే రంజాన్ సందర్భంగా కలికిరి పట్టణంలోని క్రాస్ రోడ్డు హేమాచారి కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రమేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి హాజరవుతారని, కావున మండల పరిధిలోని ముస్లిం మైనారిటీలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా యల్లయ్య



పీలేరు : పీలేరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కేవీపల్లె మండలం మోటుపల్లెవాండ్లపల్లెకు చెందిన చంద్రగిరి యల్లయ్యను నియమిస్తూ ఏపీ అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు అందాయి. ఏడాది కాలానికి నూతన మార్కెట్ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో గౌరవాధ్యక్షులుగా పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా యల్లయ్య, వైస్ చైర్మన్‌గా ఎం.రమేష్‌రెడ్డి తోపాటు కొత్తగా 13 మంది సభ్యులను నియమించారు. సభ్యులుగా ఎస్.మునీర్‌బాషా, ఎం.మునీంద్ర (కాలనీ చిన్న), ఎస్.జయప్రకాష్‌రెడ్డి, ఎం.రమణమ్మ, పి. రుక్మిణి, జి.నరేష్‌రామకుమార్‌రెడ్డి, ఎం.రమ్య, వై.వసంత కుమారి, సి.రమణమ్మ, ఎస్.కృష్ణమ్మ, వి.భారతి, మస్తాన్ సాహెబ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా యల్లయ్య మాట్లాడుతూ తన మీద నమ్మకంతో మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించినందుకు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డితోపాటు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల అభివృద్ధి



కేవీపల్లె : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరమ్మ



కలకడ : ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కేవీపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ ఈశ్వరమ్మ అన్నారు. బుధవారం మండలంలోని కేవీపల్లె గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమం విస్తృతంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి చెందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు సైపుల్లాఖాన్, నాయకులు మల్లికార్జున, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కలకడ : ప్రతి ఇంటి ఆశాజ్యోతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని మండల ఉపాధ్యక్షురాలు జల్లా క్రిష్ణకుమారి, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కోన పంచాయతీ బంగారువాండ్లపల్లె, ఎనుగొండపాళ్యం పంచాయతీలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. మండల సచివాలయాల కన్వీనర్ మోహన్‌రాజ, మండల రైతు భరోసా కేంద్రాల అధ్యక్షులు చింతకుంట హరినాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, చౌడయ్య, శివారెడ్డి, ఆయా పంచాయతీల సచివాలయ కన్వీనర్‌లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తున్న సభ్యులు

గుర్రంకొండ : ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సీతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని, సమస్యలపై సకాలంలో స్పందించడం లేదని, ప్రతి పనికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని సర్పంచ్ రౌనఖ్‌భాషా అన్నారు. పంచాయతీ పరిధిలో కొత్తవిద్యుత్ స్తంభాలు, లైన్ల ఏర్పాటు, విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ల మార్పులు వంటి పనులకు అవసరమయ్యే నిధులను కలెక్టర్ మంజూరు చేస్తారని ఎంపీడీవో వెంకటేశులు అన్నారు. తరిగొండ, శెట్టివారిపల్లెలో జేజేఎం పనులు ఇంత వరకు ఎందుకు చేయలేదో చెప్పాలని ఎంపీడీవో ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అవినీతి పేరుకుపోతోందని అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల అన్నారు. గుర్రంకొండలోని రేషన్ దుకాణాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయక పోవడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని సీడీపీవో శోభ అన్నారు. గుర్రంకొండ పట్టణంలోని పాత సింగిల్ విండో కార్యాలయం వద్ద గతంలో పలువురికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, మళ్లీ వారికే ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీలో ఇళ్లు, ఇళ్లపట్టాలు ఇచ్చారని ఎంపీటీసీ ఖదీర్ ఆరోపించారు. వెంటనే వారికి ఇళ్ల పట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని గ్రామాల్లో సంఘమిత్రల అవినీతి ఆరోపణలపై విచారణ జరుపుతున్నామని, అలాంటి వారి గ్రామ సమాఖ్యలను సీఆర్‌పీ బృందంచే ఆడిట్ చేయిస్తున్నామని ఏపీఎం రమణ అన్నారు. గ్రామాల్లో ముటేషన్ల సమస్య పరిష్కారం ఎప్పటికప్పుడు చేస్తున్నామని ఎవైనా సమస్యలుంటే వెంటనే స్పందించి పరిష్కరిస్తామని తహసీల్దార్ ఖాజాబీ అన్నారు. మండలంలోని ఆరు గ్రామాల్లో భూ రీసర్వేపనులు పూర్తి అయ్యాయని అన్నారు. సరిహద్దు రాళ్ల నాటించే కార్యక్రమం ప్రస్తుతం జరుగుతోందని, వీటి కోసం రైతులు సహకరించాలని ఆమె అన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రవినాయక్, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ కరుణాకర్, ఎంపీటీసీలు రాజగోపాల్, యాకూబ్, బాబయ్య, గంగులమ్మ, సరస్వతమ్మ, సర్పంచ్ మస్తాన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : రోడ్డు ప్రమాదాల నివారణకు వివిధ శాఖల సహకారంతో కృషి చేద్దామని డీఎస్పీ కేశప్ప అన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో నేషనల్ హైవే, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, రవాణాశాఖ అధికారులతో రోడ్డు ప్రమాదాలు నివారణకై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ ఇటీవల రోడ్డు ప్రమాదాలు అధిక సంఖ్యలో జరుగుతుండటంతో జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు ఆదేశాల మేరకు ప్రత్యేక సమీక్షా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారుల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి నివారణకై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రజలతోపాటూ విద్యార్థులు, యువకులు మరణిస్తుండటం బాధాకరమన్నారు. వాహనదారులు, డ్రైవర్లు, వాహన యజమానులతో అవగాహన సమావేశాలు నిర్వహించి రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే నష్టాలను వివరించాలని కోరారు. మితిమీరిన వేగం, ఓవర్‌టేకింగ్, ప్రమాదకర మలుపులు వద్ద ఎక్కువగా యాక్సిడెంట్లు జరుగుతున్నాయన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్లు ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో అధికారులు సత్వరమే స్పందించి ఒక్కరి ప్రాణం కాపాడగలిగినా ఎంతో మేలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ దినేష్‌చంద్ర, నేషనల్ హైవే ఈఈ శివరామ్, మున్సిపల్ డీఈ శిరీష తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



మదనపల్లె : నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మోతీనగర్ కొత్త ఇండ్లు అల్‌ఫలా మసీదు సహకారంతో దారుల్‌సలామ్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే నవాజ్‌బాషా 400 మంది పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ జరుపుకొనేందుకు ఆర్థికస్తోమత లేని నిరుపేదలను దృష్టిలో ఉంచుకుని నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. 12 ఏళ్లుగా రంజాన్ మాసంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దారుల్ సలామ్ షేక్ మహబూబ్‌బాషా(మున్నా)ను అభినందించారు. కార్యక్రమంలో రాజంపేటకు చెందిన ముస్లిం గురువు షేక్ అబ్దుర్ రహీం దాయి, అబ్దుల్లా ఉమ్రి, ఖాజా, అబ్దుల్‌జబ్బార్, జహంగీర్, టి.షఫీ, గౌస్‌పీర్, సికిందర్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, సదాశివరెడ్డి, బావాజాన్, కౌన్సిలర్ వసీం, భాను, రహీం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

బి.కొత్తకోట : స్థానిక మున్నీ శారీ సెంటర్ నిర్వాహకులు నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. 35 మంది మహిళా కార్మికులకు మాజీ ఉపసర్పంచు మాలిక్ చేతుల మీదుగా చీరలను అందజేశారు.

పీలేరు : పీలేరు పట్టణంలోని పేద ముస్లింలకు మొలకలచెరువు సీఐ సాధిక్ అలి రంజాన్ తోఫా పంపిణీ చేశారు. గతంలో పీలేరులో పని చేసిన సీఐ సాధిక్ అలి కొన్నేళ్లుగా రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్నారు. రంజాన్‌మాసంను పురష్కరించుకుని బుధవారం స్థానిక పోలీస్ క్వార్టర్స్ వద్ద పేద ముస్లింలకు సీఐ తన కుటుంబ సభ్యులతో కలసి రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రాంతంలో విధుల్లో ఉన్నా పీలేరులోని పేద ముస్లింలకు ప్రతి ఏటా రంజాన్ తోఫా అందిస్తానని తెలిపారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సీఐ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణంలో 600 మందికి రంజాన్ తోఫాలు పంపిణీ చేశారు. స్థానిక దావూద్ సాహెబ్ వీధిలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు ఎస్‌డీఎస్ గయాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరెలు, పురుషులకు పంచెలు, ప్యాంట్లు, షర్టులు పంపిణీ చేశారు.

ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే సహించం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ

కలికిరి : పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిపై కలికిరి సర్పంచ్ ప్రతాప్‌కుమార్‌రెడ్డి అనవసర విమర్శలు చేయడం మానుకోవాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రమేష్ కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజకీయ భిక్షతో సర్పంచ్ పదవి చేపట్టిన సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, తిరిగి ఆయనపైనే విమర్శలు గుప్పించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విమర్శలు మాని కలికిరి గ్రామ పంచాయతీ అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్‌రెడ్డి, శివాజీ, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, గుట్టపాళెం సర్పంచ్ వెంకటరెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డెప్ప, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడీ హరి, నాయకులు ఫయాజ్, ఖాదర్‌వల్లి, విశ్వనాథ, సహదేవ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు వినియోగించుకోండి

కలకడ : ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో అందించే ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి కోరారు. బుధవారం ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని ఎగువతండా, దిగువతండా గ్రామాలలో104 ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలను అందించారు. 112 మందికి సాధారణ చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. 18 మంది గర్భవతులకు చికిత్సలు చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. బాలింతలకు, చక్కరవ్యాధిగ్రస్తులకు, బీపీ ఉన్న వారికి చెకప్‌చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, సూపర్‌వైజర్ సుబ్బరత్న, ముజీబ్, ఆరోగ్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆధార్ మంజూరుకు బర్త్‌సర్టిఫికెట్ తప్పనిసరి

తంబళ్లపల్లె : మండలంలోని చిన్నపిల్లలకు ఆధార్‌కార్డు మంజూరు చేసేందుకు బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీవో ఆనంద్‌కుమార్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు ఆధార్‌కార్డు లేని చిన్నపిల్లలను గుర్తించడం, వారికి బర్త్ సర్టిఫికెట్లు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని నిర్ధారించాలన్నారు. లేని వారికి ఆసుపత్రులలో జననం జరిగి ఉంటే, అక్కడి నుంచి తెప్పించాల్సిన బాధ్యత మీదేనన్నారు. ఇంటిలో జననం ఉండి, పంచాయతీ రికార్డులలో నమోదు చేసుకోకుంటే అటువంటి వారి వద్ద దరఖాస్తు చేయించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సచివాలయాలలో లేట్ ఎంట్రీ చేయించి వారికి బర్త్ సర్టిఫికెట్ ఇప్పించాలన్నారు. అనంతరం ఆధార్ కేంద్రాలలో సంబంధిత పిల్లలకు ఆధార్‌కార్డు చేయించాలన్నారు. ఈసమావేశంలో సీడీపీవో నాగవేణి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలి



వాల్మీకిపురం: అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



ములకలచెరువు : అగ్ని ప్రమాదం నివారణపై వివరిస్తున్న ఫైర్ సిబ్బంది

మదనపల్లె : అగ్నిప్రమాదాలపై అవగాహన పెంచుకున్నప్పుడే నివారణ చర్యలు సమర్థవంతంగా చేపట్టవచ్చని అగ్నిమాపక కేంద్రం అధికారి మాబు సుభాన్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆరో రోజైన బుధవారం పట్టణంలోని శ్రీనివాస ఆస్పత్రిలో అగ్నిప్రమాదాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏదైనా అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రయోగాత్మకంగా ప్రదర్శన ద్వారా వివరించారు. అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు తక్షణమే అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ నెంబర్.101, లేదా 08571–222101, 9963735597కు సమాచారం అందించాలన్నారు.

వాల్మీకిపురం : అగ్నిప్రమాదాలను నిర్లక్ష్యం చేయకూడదని ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి సుబ్బరాజు అన్నారు. స్థానిక తరిగొండ రోడ్డులోని పెట్రోల్ బంక్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బంక్ పరిసరాలలో అగ్ని ప్రమాదం సంభవిస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో డెమో ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో బాబయ్య, శ్రీనివాసులు, కిరణ్‌కుమార్, రవి, చైతన్య, ఇమ్రాన్, భాస్కర్, రెడ్డి శేఖర్, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : అగ్ని ప్రమాదాల పట్ల ఆస్పత్రుల్లో తగు జాగ్రత్తలు పాటించాలని అగ్ని మాపక కేంద్ర అధికారి సుబ్బరాజు అన్నారు. స్థానిక రిషి హాస్పిటల్‌లో ఆస్పత్రి సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రుల్లో ఏవైనా ప్రమాదాలు జరిగితే ఆస్పత్రుల్లో వ్యాధిగ్రస్తులను ఎలా బయటకు తరలించాలి, ఎలా రక్షించాలో ప్రయోగాత్మకంగా సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుబ్బరాజు, శ్యాంప్రసాద్, నాగిరెడ్డి, హేమాద్రిరెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, వెంకటేష్, వెంకటరమణ, రెడ్డిశేఖర్, షఫీ షకీల్‌నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువు : ఇళ్లలో వంట గ్యాస్ ఉపయోగంలో మహిళలు మెలకువలు వహించాలని ఫైర్ అధికారి క్రిష్ణయ్య కోరారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మహిళలతో వంట గ్యాసుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ అధికారి మాట్లాడుతూ వంట గదిలోకి గాలి బాగా వచ్చేలా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా కిటికీ పరిసర ప్రాంతాల్లో గ్యాసుస్టౌ ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, ఫైర్ సిబ్బంది ఉన్నారు.